## చలాన్ల రాయితీని వినియోగించుకోవాలి : ఎస్పీ రాహుల్ హెగ్డే



సూర్యాపేట సిటీ, డిసెంబర్ 29 : రాష్ట్రంలో రోడ్డు నిబంధనలు ఉల్లంఘించిన వారికి సంబంధించి పోలీస్ శాఖ వారు వాహనాలపై విధించిన పెండింగ్ చలాన్లపై రాష్ట్ర ప్రభుత్వం రాయితీ ప్రకటించిందని ఎస్పీ రాహుల్ హెగ్డే శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రాయితీ ప్రక్రియ డిసెంబర్ 26 నుంచి అమల్లోకి వచ్చిందని, ఈ అవకాశాన్ని వాహనదారులు సద్వినియోగం చేసుకొని వాహనాలపై ఉన్న పెండింగ్ చలాన్లను చెల్లించాలని సూచించారు. ఆర్టీసీ బస్సులు, తోపుడుబండ్లపై 90 శాతం, ద్విచక్ర వాహనాలపై 80 శాతం, ఆటోలు, కార్లు, జీపులు, ట్యాక్సీలపై 60 శాతం, భారీ వాహనాలపై 50 శాతం రాయితీ ప్రకటించినట్లు తెలిపారు. జిల్లాలో 25వ తేదీ వరకు 6,08,968 ఈ-చలాన్ కేసులు పెండింగ్ ఉన్నట్లు పేర్కొన్నారు. వీటిలో గత మూడ్రోజులుగా 30,600 ఈ-చలాన్ కేసులను పరిష్కరించుకున్నారని, ఇందుకుగానూ ప్రభుత్వానికి రూ.31.65 లక్షలు వచ్చినట్లు తెలిపారు.

## ఎన్నికల ఖర్చు నివేదికల పరిశీలన



ఎన్నికల ఖర్చులను పరిశీలిస్తున్న అధికారులు

నల్లగొండ, డిసెంబర్ 29 : అసెంబ్లీ సాధారణ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థుల ఎన్నికల ఖర్చు నివేదికలను ఎన్నికల వ్యయ పరిశీలకులు సతీశ్ గురుమూర్తి, డీఎం నిమ్జే, సంతోష్ కుమార్ పరిశీలించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎలక్షన్ వ్యయ బృందాలకు సంబంధించిన అధికారులతో ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థుల ఖర్చులు, రీ కన్సిలేషన్లపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మునుగోడు, దేవరకొండ నియోజకవర్గాల నివేదికలను సతీశ్ గురుమూర్తి, నాగార్జునసాగర్, మిర్యాలగూడ నియోజకవర్గాల నివేదికలను డీఎం నిమ్జే, నకిరేకల్, నల్లగొండ నియోజకవర్గాల నివేదికలను సంతోశ్ కుమార్ పరిశీలించి అధికారులకు తగు సూచనలు చేశారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, సూపరింటెండెంట్ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

*యాసంగి పంటల సాగు కోసం కాళేశ్వరం జలాలను వారబందీ పద్ధతిలో విడుదల చేయనున్నారు. సూర్యాపేట జిల్లాలో జనవరి 8నుంచి మార్చి 30వ తేదీ వరకు కొనసాగే నీటి విడుదల షెడ్యూల్‌ను శుక్రవారం నీటి పారుదల శాఖ అధికారులు వెల్లడించారు. రోజుకు 4వేల క్యూసెక్కుల చొప్పున 6 విడుతల్లో 48రోజులు నీటి విడుదల చేయనున్నారు. ఆరుతడి పంటలకు ప్రాధాన్యం ఇవ్వాలని, నీటిని పొదుపుగా వాడుకోవాలని అధికారులు రైతులకు సూచించారు. గతేడాది యాసంగి సాగుకు ప్రభుత్వం జనవరి 8నుంచి ఏప్రిల్ 15వరకు 56రోజులపాటు సాగునీరు అందించింది.*

*– తిరుమలగిరి, డిసెంబర్ 29*



నాగారం మండలం ప్రగతినగర్ వద్ద ప్రవహిస్తున్న కాళేశ్వరం జలాలు(ఫైల్)

# యాసంగి సాగుకు కాళేశ్వరం జలాలు

## జనవరి 8నుంచి మార్చి 30 వరకు నీటి విడుదల

- వారబందీ పద్ధతిలో ఆరు విడుతల్లో 48 రోజులు
- షెడ్యూల్ విడుదల చేసిన నీటి పారుదల శాఖ
- ఆరుతడి పంటలు వేసుకోవాలని అధికారుల సూచన

**నీటి విడుదల షెడ్యూల్..**

| తేదీ | రోజుల సంఖ్య | రోజుకు విడుదల చేయనున్న నీరు (క్యూసెక్కులు ) |
|---|---|---|
| జనవరి 8నుంచి 15 వరకు | 8 రోజులు | 4వేల క్యూసెక్కులు |
| జనవరి 23నుంచి 30 వరకు | 8రోజులు | 4వేల క్యూసెక్కులు |
| ఫిబ్రవరి 7నుంచి 14 వరకు | 8 రోజులు | 4వేల క్యూసెక్కులు |
| ఫిబ్రవరి 22 నుంచి 29 వరకు | 8రోజులు. | 4వేల క్యూసెక్కులు |
| మార్చి 8 నుంచి 15 వరకు | 8 రోజులు | 4వేల క్యూసెక్కులు |
| మార్చి 23 నుంచి 30 వరకు | 8 రోజులు | 4వేల క్యూసెక్కులు |

### మూడేండ్లుగా నిరంతరాయంగా నీరు

ప్రభుత్వం ఎస్‌ఆర్‌ఎస్‌పీ కాల్వలతో మూడేండ్లుగా నిరంతరాయంగా కాళేశ్వరం జలాలు అందిస్తుండడంతో కరువు ప్రాంతమైన తుంగతుర్తి, సూర్యాపేట నియోజకవర్గాలు సస్యశ్యామలయ్యాయి. బీడు భూముల్లో పచ్చని పొలాలుగా మారాయి. తిరుమలగిరి మండలంలోని వెలిశాల 69 డీబీఎం నుంచి తుంగతుర్తి, మద్దిరాల, నూతనకల్ మండలాలకు.. 70డీబీఎం కాల్వ ద్వారా నాగారం మండలం 71డీబీఎంతో నాగారం, అర్వపల్లి మండలాలతో పాటు సూర్యాపేట నియోజక వర్గంలోని ఆత్మకూర్ ఎస్, చివ్వెంల, పెన్‌పహాడ్, మండలాలతో పాటు కోదాడ నియోజక వర్గంలోని మోతె, నడిగూడెం మండలాల్లో ని పలు గ్రామాలకు కాళేశ్వరం జలాలు అందనున్నాయి.

### నిండుకుండల్లా చెరువులు, కుంటలు

వానకాలం ఎస్‌ఆర్‌ఎస్‌పీ నీటి విడుదలతో ఇప్పటికే నియోజకవర్గంలోని చెరువులు, కుంటలు నిండుకుండల్లా దర్శనమిస్తున్నాయి. భూగర్భ జలాలు విపరీతంగా పెరగడంతో 30నుంచి 40ఫీట్లలోనే నీళ్లు పుష్కలంగా అందుతున్నాయి. బోర్లలో నిండుగా నీళ్లు ఉండడంతో ఇప్పటికే రైతులు యాసంగి సాగుకు సిద్ధమయ్యారు. యాసంగి నీటి విడుదలపై ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

### వారబందీ విధానంలో..

వారబందీ విధానంలో కాళేశ్వరం జలాలు సూర్యాపేట జిల్లాకు రానున్నాయి. జనవరి 8నుంచి 16వరకు నీరందించి అనంతరం 15రోజుల పాటు నిలిపివేస్తారు. తుంగతుర్తి, సూర్యాపేట, కోదాడ నియోజకవర్గాల్లో రెండో దశ కింద 2,23,000 ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ సీజన్‌లో పూర్తి ఆయకుట్టుకు నీరందించాలని అధికారులు నిర్ణయించారు. సాగు నీటిని రైతులు పొదుపుగా వాడుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

# రెండో రోజు 37,750 దరఖాస్తులు

## ‘ప్రజా పాలన’కు స్పందన కరువు

నల్లగొండ, డిసెంబర్ 29 : ప్రజాపాలన కార్యక్రమంలో వివిధ పథకాల కోసం దరఖాస్తులు అంతంత మాత్రంగానే వచ్చాయి. తొలి రోజు మాదిరిగానే ప్రజలకు సమస్యలు ఎదురయ్యాయి. అధికారులు, సిబ్బంది సరైన అవగాహన కల్పించకపోవడం, దరఖాస్తు ఫారాలు నింపడంలో కొంత ఇబ్బంది పడ్డారు. జిల్లా వ్యాప్తంగా శుక్రవారం 116 గ్రామ పంచాయతీలతో పాటు 58 మున్సిపల్ వార్డుల నుంచి దరఖాస్తుల స్వీకరణ జరిగింది. 53,844 కుటుంబాలకు దరఖాస్తు ఫారాలు ఇవ్వగా 37,750 కుటుంబాలు దరఖాస్తు చేసుకున్నాయి. ఇప్పటి వరకు ఈ రెండు రోజుల్లో 292 గ్రామాలు, వార్డుల నుంచి 1,02,193 ఇండ్లకు గానూ 64,691 కుటుంబాలు దరఖాస్తు చేసుకున్నాయి.



సూర్యాపేటలోని భగత్‌సింగ్ నగర్‌లో ప్రజాపాలన దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు



నల్లగొండలో దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

### సూర్యాపేట జిల్లాలో 35,109 దరఖాస్తులు

సూర్యాపేట : సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా ప్రజా పాలన కార్యక్రమంలో 35,109 దరఖాస్తులు వచ్చాయని కలెక్టర్ యస్. వెంకట్రావ్ తెలిపారు. 85 గ్రామ పంచాయతీల్లో 27,695, 21 మున్సిపల్ వార్డుల్లో 7414 దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. రెండు రోజుల్లో 43,918 మంది దరఖాస్తు చేసుకున్నారని, జనవరి 6వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతుందని తెలిపారు.

## ప్రజాపాలన సభలను సద్వినియోగం చేసుకోవాలి

- ఒకే అప్లికేషన్‌తో అన్ని పథకాలకు దరఖాస్తు చేసుకోవచ్చు
- ఉమ్మడి నల్లగొండ జిల్లా నోడల్ అధికారి ఆర్‌వీ కర్ణన్



సూర్యాపేటలోని 19వ వార్డు భగత్‌సింగ్ నగర్‌లో ప్రజా పాలన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఉమ్మడి జిల్లా నోడల్ అధికారి ఆర్‌వీ కర్ణన్, పక్కన కలెక్టర్ ఎస్.వెంకట్రావ్

బొడ్రాయిబజార్, డిసెంబర్ 29 : రాష్ట్ర ప్రభుత్వం అభయ హస్తం పథకాల దరఖాస్తుల్లో భాగంగా నిర్వహిస్తున్న ప్రజాపాలన సభలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి నల్లగొండ జిల్లా నోడల్ అధికారి ఆర్‌వీ కర్ణన్ సూచించారు. ప్రజాపాలన సభల్లో భాగంగా శుక్రవారం సూర్యాపేటలోని 3, 19, 20, 35, 36, 45వ వార్డుల్లో నిర్వహించిన దరఖాస్తుల స్వీకరణలో భాగంగా 19వ వార్డులో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి మాట్లాడారు. జిల్లా కేంద్రంలో ప్రజాపాలన గ్రామసభలను పకడ్బందీగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. అన్ని చోట్లా కేవలం ఐదారు కౌంటర్లు మాత్రమే పెట్టి దరఖాస్తులు స్వీకరిస్తుంటే, సూర్యాపేట జిల్లా కేంద్రంలో 8 నుంచి 9 కౌంటర్లు పెట్టి దరఖాస్తులు స్వీకరించేలా ఏర్పాట్లు చేయడం అభినందనీయమన్నారు. అన్ని సంక్షేమ పథకాలకు ఒకే అప్లికేషన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని, రేషన్ కార్డు లేకున్నప్పటికీ సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఆయా వార్డుల్లో సభ నిర్వహించిన రోజున ఎవరైనా అందుబాటులో లేకుంటే ఆ తర్వాత తమ దరఖాస్తులను స్థానిక అధికారులకు సమర్పించవచ్చన్నారు. అన్ని ప్రజాపాలన సభల్లో జనరల్ కౌంటర్‌ను కూడా ఏర్పాటు చేసి ప్రజల నుంచి సమస్యలపై కూడా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎస్.వెంకట్రావ్, మున్సిపల్ కమిషనర్ రామానుజుల రెడ్డి, ఏఎస్పీ నాగేశ్వర్‌రావు, జడ్పీ సీఈఓ సురేశ్, మెప్మా పీడీ రమేశ్‌నాయక్, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, ఆయా వార్డుల కౌన్సిలర్లు గండూరి పావనీకృపాకర్, సుంకరి అరుణారమేశ్, ధీరావత్ రవి నాయక్, ఆయా వార్డుల నాయకులు పాల్గొన్నారు.

## రేషన్‌కార్డు లేకుంటే దరఖాస్తు ఫారమ్ ఇవ్వం

**కొత్త రేషన్ కార్డు కోసం తెల్ల పేపర్ మీద రాసి ఇవ్వాలంటున్న సిబ్బంది**

**ప్రజాపాలన కార్యక్రమంలో ప్రజల ఇబ్బంది**

పెద్దఅడిశర్లపల్లి : ఐదు గ్యారెంటీ పథకాల ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన కార్యక్రమం జనాలను ఇబ్బందులకు గురి చేస్తున్నది. దరఖాస్తు ఫారాలను జనాలకు సరిపడా అందించడం లేదు. సంబంధిత సిబ్బంది లబ్ధిదారుల ఇంటికే పంపిణీ చేస్తామని చెప్పినా రావడం లేదు. గ్రామ పంచాయతీ వద్ద ఏర్పాటు చేసిన సభల్లోనూ పూర్తిస్థాయిలో ఇవ్వడం లేదు. దాంతో జిరాక్స్ కాపీలు కొనుక్కోవాల్సి వస్తున్నది. మరోవైపు రేషన్ కార్డు ఉంటేనే దరఖాస్తు ఫారాలు ఇస్తామని చెబుతున్నారు. దీనికితోడు దరఖాస్తు ఫారమ్‌లో రేషన్‌కార్డుకు సంబంధించిన కాలమ్ లేకుండా పోయింది. దాంతో రేషన్ కార్డులేని లబ్ధిదారుల వివరాలను తెల్లపేపరు మీద రాసివ్వాలని చెబుతున్నారు. చాలా మందికి రేషన్ కార్డు లేనందున వైట్ పేపర్‌పై వివరాలు తీసుకొస్తే తీరా అవి చెల్లవని అధికారులు నిరాకరిస్తున్నారు. రేషన్ కార్డు లేకుండా ఆరు గ్యారెంటీల దరఖాస్తులు ఎందుకు స్వీకరిస్తున్నారని గ్రామ సభలో ప్రజలు అధికారులను ప్రశ్నిస్తున్నారు. శుక్రవారం పెద్దఅడిశర్ల మండలంలోని అజ్మాపురం, పుట్టంగండి, అంగడిపేట, కేశంనేనిపల్లి గ్రామాల్లో ప్రజా పాలన గ్రామ సభలు నిర్వహించారు. కొన్ని గ్రామాల్లో సంబంధిత అధికారులు లేరని దరఖాస్తు రసీదు బదులుగా ఫారమ్ నంబర్ తెల్లకాగితంపై వేసి పంపిస్తున్నారు.

## ఆన్‌లైన్‌లో జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ మానక్ పోటీలు

సూర్యాపేట అర్బన్, డిసెంబర్ 29 : 2022-23 విద్యా సంవత్సరం ఇన్‌స్పైర్ మానక్ పోటీల్లో జిల్లా నుంచి ఎంపికైన విద్యార్థులకు జనవరిలో ఆన్‌లైన్ ద్వారా పోటీలను నిర్వహించి రాష్ట్ర స్థాయికి ఎంపిక చేయనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలను జనవరి 1 నుంచి 18 వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులు వారికి సంబంధించిన ప్రాజెక్టులను వీడియో, ఇతర వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. జిల్లా స్థాయిలో ఎంపికైన ప్రాజెక్టులు రాష్ట్ర స్థాయిలో జనవరి 26 నుంచి 31 వరకు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసి జరిగే పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు. ఫిబ్రవరి 1 నుంచి 3 వరకు రాష్ట్ర స్థాయి ఎంపికలు ఉంటాయని పేర్కొన్నారు. ఇతర వివరాలకు సైన్స్ అధికారి దేవరాజ్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

## సురేశ్‌పై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం

- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్



సురేశ్‌ను పరామర్శిస్తున్న ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్

బొడ్రాయిబజార్, డిసెంబర్ 29 : తుంగతుర్తి నియోకవర్గం అర్వపల్లి మండలం కాసర్లపహాడ్ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు మెండె సురేశ్, అతని భార్య, పిల్లలపై కాంగ్రెస్ నాయకులు దౌర్జన్యంగా దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్ తెలిపారు. కాంగ్రెస్ నాయకుల దాడిలో గాయపడి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సురేశ్‌ను శుక్రవారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద వర్గానికి చెందిన నాయకుడని చూడకుండా రైతుబంధు రాలేదని అడుగుతావా? నీళ్లు రాలేదని వాట్సాప్‌లో పెడుతావా? అంటూ దాడి చేయడం బాధాకరమన్నారు. గత పదేండ్లలో బీఆర్‌ఎస్ పాలనలో ఎలాంటి ఘర్షణలు, దౌర్జన్యాలు, రౌడీయిజానికి తావు లేకుండా పాలన సాగించినట్లు గుర్తు చేశారు. నేడు కాంగ్రెస్ పాలనలో బీఆర్‌ఎస్ నాయకులపై అకారణంగా దాడులు చేయడం తగదన్నారు. మరోసారి ఇలా జరిగితే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. పదేండ్ల కిందటి విష సంప్రదాయాన్ని మళ్లీ తెచ్చే ప్రయత్నం మానుకోవాలని సూచించారు. దాడికి పాల్పడిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సురేశ్ కుటుంబానికి బీఆర్‌ఎస్ పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. ఆయన వెంట జడ్పీటీసీ దావుల వీరప్రసాద్‌యాదవ్, బీఆర్‌ఎస్ అర్వపల్లి మండలాధ్యక్షుడు గుండగాని సోమేశ్‌గౌడ్, బొడ్డు రామలింగయ్య, గణేశ్ ఉన్నారు.



మేకలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి

## అనిల్ ఆగ్రోఫామ్ సందర్శన

- గొర్రెలు, మేకల ఎదుగుదలపై ఆరా తీసిన ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ కోటిరెడ్డి

త్రిపురారం, డిసెంబర్ 29 : మండల కేంద్రంలోని మర్ల అనిల్‌కుమార్‌రెడ్డి ఆగ్రోఫామ్‌ను మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి శుక్రవారం సందర్శించారు. ఆగ్రోఫామ్‌లో పెంచుతున్న గొర్రెలు, మేకల ఎదుగుదల గురించి అడిగి తెలుసుకున్నారు. పంట పొలాలను పరిశీలించారు. కోళ్లు, గొర్రెలకు ఎలాంటి మేత వేస్తున్నారు, ఎంత ఆదాయం వస్తుందనే అంశాలను అనిల్‌కుమార్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆగ్రోఫామ్ అంతటా కలియతిరిగారు. వారి వెంట తిరుమలగిరి(సాగర్) ఎంపీపీ భగవాన్‌నాయక్, రైతుబంధు సమితి కో ఆర్డినేటర్ అనుముల శ్యాంసుందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకుడు కోటిరెడ్డి, అంబేద్కర్ యూత్ అధ్యక్షుడు మద్దిమడుగు మార్క్ ఉన్నారు.

## ఫణిగిరి కాకతీయుల రెండంతస్తుల మండపాన్ని కాపాడుకోవాలి

- పురావస్తు పరిశోధకుడు ఈమని శివనాగిరెడ్డి



మండపాన్ని పరిశీలిస్తున్న పురావస్తు పరిశోధకుడు ఈమని శివనాగిరెడ్డి

నాగారం, డిసెంబర్ 29 : సూర్యాపేట జిల్లా నాగారం మండల పరిధి ఫణిగిరి గ్రామ శివారులోని నరసింహాలయం ఎదుట శిథిలమవుతున్న రెండంతస్తుల మండపాన్ని కాపాడుకోవాలని పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈఓ డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి కోరారు. ఆలయ పరిసరాలను శుక్రవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ఈ రెండంతస్తుల మండపం క్రీస్తుశకం 13వ శతాబ్దికి చెందిన కాకతీయ వాస్తుశైలికి అద్దం పడుతుందని, చుట్టూ మట్టి పేరుకుపోయి మొదటి అంతస్తు సగం పూడి పోయిందని, రెండో అంతస్తుపైన ఉన్న విమానం పెచ్చులు ఊడి పోయాయని చెప్పారు. తక్షణమే మరమ్మతులు చేపట్టి మండప భాగాలపై కొట్టి సున్నాన్ని తొలగించి చారిత్రక నిర్మాణాన్ని భవిష్యత్ తరాలకు అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# ఆన్‌లైన్ గేమ్స్‌తో ఆగం

- ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్న యువత
- జూదంతో గుల్లవుతున్న జేబులు
- అడిక్ట్‌తో లక్షల రూపాయలు స్వాహా
- డబ్బులు పోయాక మనస్తాపంతో ఆందోళన
- ఇటీవల ఓ వ్యక్తి సెల్ఫీ వీడియోతో కలకలం




**భువనగిరి మండలంలోని బండ సోమారం గ్రామానికి చెందిన చెరుకూరి ప్రసాద్ ఆన్‌లైన్ గేమ్స్‌కు అడిక్ట్ అయ్యాడు. బిజినెస్ కోసం అత్తగారిచ్చిన ఎకరం భూమిని రూ.32 లక్షలకు అమ్మాడు. ఆ డబ్బులతో అత్యాశకు పోయి ఆన్‌లైన్ గేమ్ ఆడాడు. తొలుత రూ.5లక్షల వరకు పోగొట్టుకున్నాడు. తన వద్ద ఉన్న మరో రూ.17లక్షలతో ఓపెన్ ప్లాట్ కొని.. ఆ తర్వాత ప్లాట్ పేపర్లు తాకట్టు పెట్టి రూ.15లక్షల అప్పు తెచ్చాడు. ఆ డబ్బంతా ఆన్ లైన్ గేమ్‌లో పోవడంతో కుటుంబ సభ్యులు మందలించారు. దీంతో ఆత్మహత్యకు పాల్పడుతున్నట్టు సెల్ఫీ వీడియో తీసి ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి అజ్ఞాతంలోకి వెళ్లాడు. రెండు రోజుల తర్వాత తిరిగి ఇంటికి చేరడంతో కథ సుఖాంతమైంది. ఇదీ ఇటీవల బయటకు వచ్చిన కేసు. బహిర్గతం కాని ఇలాంటి కేసులు మరెన్నో ఉన్నాయి.**

యాదాద్రి భువనగిరి, డిసెంబర్ 29 (నమస్తే తెలంగాణ) : ఆన్‌లైన్ గేమ్స్‌తో జనం ఆగమవుతున్నారు. విద్యార్థుల నుంచి పెద్దల వరకు పైసలు పోగొట్టుకుంటూ జేబులు గుల్ల చేసుకుంటున్నారు. గేమ్‌లకు బానిసవుతూ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు.అప్పులు చేసి మరీ గేమ్స్ ఆడుతూ కుటుంబాలను వీధిన పడేస్తున్నారు. కరోనా తర్వాత చిన్నా, పెద్ద స్మార్ట్‌ఫోన్‌ను విపరీతంగా ఉపయోగిస్తున్నారు. కాలక్షేపం పేరుతో యాప్స్‌ను వాడుతున్నారు. ఇదే క్రమంలో ఆన్‌లైన్ గేమ్స్‌కు బానిసలవుతున్నారు. చిన్న పిల్లలు తెలియక బాధితులు అవుతుండగా, పెద్దలు మాత్రం డబ్బుల అత్యాశతో ఈ జూదంలోకి దిగుతున్నారు. విద్యార్థులు, యువతతోపాటు పెద్దలు, ఉద్యోగులు సైతం ఆన్‌లైన్ జూదం బాటపట్టి రమ్మీ ఆడుతున్నారు.

ఫోన్‌లో నెట్ సౌకర్యం, బ్యాంకు అకౌంట్లో డబ్బులు ఉంటే చాలు ఎక్కడి నుంచైనా రమ్మీ ఆడొచ్చు. ఆన్‌లైన్‌లో పేకాటకు సంబంధించి 20కి పైగా యాప్స్ అందుబాటులో ఉన్నాయి.

చాలామంది ఆన్‌లైన్‌లో జంగల్ రమ్మీ, క్లాసిక్ రమ్మీ, ప్లే రమ్మీ, ఏసీఈ టూ త్రీ డాట్ కామ్, ఫస్ట్ గేమ్స్ డాట్ కాం, డక్కన్ రమ్మీ డాట్ కాం తదితర వెబ్‌సైట్‌లో పేకాట ఆడుతూ జేబుకు చిల్లు పెట్టుకుంటున్నారు.

### అప్పులు చేసి మరీ..

ఆన్‌లైన్ గేమ్స్‌కు అలవాటు పడిన వారు అప్పుల కోసం ప్రయత్నిస్తున్నారు. స్మార్ట్ ఫోన్‌లో పలు రకాల ప్రైవేట్ లోన్ యాప్స్‌లో అప్పులు తీసుకొని మరీ గేమ్ ఆడుతున్నారు. తరువాత అవి తీర్చలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇంకొంత మంది గేమ్‌లో డబ్బులు పోవడంతో బండ్లు, ఫోన్లు తాకట్టు పెడుతుండగా, మరికొంత మంది అమ్ముకుంటున్నారు. అనేక మంది బయట వడ్డీలకు తీసుకుంటున్నారు. తిరిగి ఇవి కట్టలేక ఆస్తులు తాకట్టు పెట్టడంతో పాటు గత్యంతరం లేక అమ్ముకుంటున్నారు. దాంతో కుటుంబాలు రోడ్డు మీద పడుతున్నాయి.